క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్సై రవి



జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్సైగా బాదావత్ రవి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న బి.రాణా ప్రతాప్‌పై ఇటీవల సస్పెన్షన్ వేటు పడింది. ఈ స్థానంలో ఖమ్మం నుంచి రవి బదిలీపై జూలూరుపాడు వచ్చారు.

హెల్త్ సబ్ సెంటర్ సందర్శన

జూలూరుపాడు: అనంతారం హెల్త్ సబ్‌సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ కార్యాలయ జిల్లా ఎపిడమాలజిస్ట్ ఇమ్మాన్యుయేల్, హెచ్‌ఏ శంకర్ బుధవారం సందర్శించారు. కిడ్నీబాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అదేవిధంగా స్థానిక హెల్త్ సబ్‌సెంటర్‌లో రికార్డులు, రిజిష్టర్లను తనిఖీ చేశారు. సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్‌వీ రాధిక, ఏఎన్‌ఎంలు సావిత్రి, రీనా, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

కొత్తగూడెంరూరల్: తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను అందిస్తుందని ఇందుకోసం 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ అధికారి సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కుట్టు మిషన్లు నిరాశ్రయులు, వితంతువులు, విడాకులైన మహిళలు, అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: సంపత్‌నగర్ గ్రామానికి చెందిన కుంపటి నరేష్ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం మృతుడి దశదిన కర్మల కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్ స్థానిక నాయకులు కృష్ణ, పాషా, రామనాథం, బెంజీరావు, నగేష్‌ల సహకారంతో రూ.30వేల నగదుని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈది గణేష్, భూక్యా సర్దార్, నాగేశ్వర్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

టేకులపల్లి: ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 48 గంటల నిరవధిక సమ్మె చేయనున్నట్లు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో సమ్మె చేయనున్నట్లు బుధవారం ఐటీడీఏ డీడీ మణెమ్మకు సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రాజేష్, శేఖర్, జనార్దన్, శ్రీను, సునీత పాల్గొన్నారు.

'ఉపాధి' తనిఖీ

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బుధవారం ప్రారంభమైంది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు కొనసాగిన ఉపాధి పనులను తనిఖీ బృందం సభ్యులు క్షేత్రపర్యటనలో పరిశీలించనున్నారు. తనిఖీ బృందం సభ్యులు, ఈజీఎస్ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ శంకర్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, డీఆర్‌పీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మహాసభకు తరలిరండి..



మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: ఈనెల 20, 21 తేదీల్లో ఇల్లెందులో జరగనున్న సీపీఎం మహాసభల సందర్భంగా ప్రదర్శన, ప్రారంభ సభకు సీపీఎం శ్రేణులు తరలిరావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ తెలిపారు. బుధవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్టీ కార్యాలయం నుంచి సభాప్రాంగణం వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. శ్రీధర్, నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, కృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: ఆధునిక సమాజంలో యువత పాత్ర చాలా కీలకం అని, యువత సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కే అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో యాచకులకు బుధవారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సీఐలు కరుణాకర్, శివప్రసాద్, శ్రీకాంత్, మెరుగు చింటు, శివ, సిద్దు, కౌశిక్, నవీన్, సుమంత్, శ్రీను పాల్గొన్నారు.

రాత్రి ప్రయాణాలు మానుకుంటే మేలు



ఖమ్మంక్రైం: విపరీతమైన చలికి తోడు మంచు కురుస్తుండడం .. చలితో చేతులకు పట్టు లభించే అవకాశం ఉండనందున రాత్రి సమయాన ప్రయాణాలతో ప్రమాదాలు ఎదురయ్యే అవకాశముంది. రాత్రివేళ సాధ్యమైనంత మేర దూరం వెళ్తే ఉదయం ఇతర పనులు చేసుకోవచ్చని భావిస్తుంటారు. కానీ ప్రస్తుత సమయాన రాత్రి ప్రయాణాలు మానుకుంటేనే మేలని ఖమ్మం ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వరప్రసాద్ సూచించారు. ఈ మేరకు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వెల్లడించిన వివరాలు... త్వరలో క్రిస్మస్ సెలవులు, నూతన సంవత్సరం వేడుకలకు పలువురు విహారయాత్రలకు వెళ్లే అవకాశముంది. మధ్య తరగతి ప్రజలు కూడా సొంత కార్లు ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు చలి ప్రభావం ఉన్నందున పగటి వేళ ప్రయాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పనిసరి రాత్రిపూట వెళ్లాల్సి వస్తే కారుకు ఫాగ్ ల్యాంప్‌లు వేసుకోవాలి. అలాగే ఎమర్జెన్సీ లైట్లు కూడా వాడాలి. వేగంగా కాకుండా 40 నుంచి 50 కి.మీ.కు మించి వేగంతో వెళ్లొద్దు. తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటున్నందున కారు వైపర్లు పనిచేస్తున్నాయో, లేదో పరీక్షించుకోవాలి. అలాగే, కారులో హీటర్ పనితీరును గమనించాలి. ఇక ద్విచక్రవాహనదారులు సైతం రాత్రివేళ ప్రయాణించాల్సి వస్తే ఎమర్జెన్సీ లైట్లు తప్పక వాడాలి. చేతులకు గ్లౌస్ వేసుకుంటే పట్టు ఉంటుంది.



వరప్రసాద్, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ, ఖమ్మం

చలివేళ.. గ్యాడ్జెట్ల వాడకంలో అప్రమత్తత



ఖమ్మం మయూరిసెంటర్: ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయిలో నమోదవుతున్నప్పుడు కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలోని విడిభాగాలు ప్రభావితం అవుతాయి. ఈ మేరకు వీటిని ఉపయోగించే వారు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఖమ్మంకు చెందిన హార్డ్‌వేర్ నిపుణుడు జి.కోటి వివరించారు. మంచు కురిసే సమయాన బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైల్స్ వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదముంటుంది. ఈ కారణంగా తడితో విడిభాగాలు కాస్త దెబ్బతింటాయి. అందువల్ల మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగం తగ్గించడం మంచిది. తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు కంప్యూటర్లు, ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడిభాగాలపై కొంత ప్రభావం ఉంటుంది. ఇదే సమయాన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం చూపదు. ఇక కలర్ ప్రింటర్లను ప్రతిరోజు తప్పక వినియోగించాలి. ఇందులో భాగంగా రోజుకొక ప్రింట్ అయినా తీయాలి. తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో వీటిని వినియోగించకుంటే పని చేయడం ఆగిపోతాయి.



జి.కోటి, ఖమ్మం

ఘనంగా సెమీ క్రిస్మస్



టేకులపల్లి: కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, సిస్టర్లు

పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో..

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని హేమచంద్రాపురం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్పీ రోహిత్‌రాజ్ హాజరై కేక్ కట్ చేశారు. మాట్లాడుతూ... అన్నిమతాల ప్రజలు మతసామరస్యాన్ని పాటిస్తూ పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్) టి.సాయి, మనోహర్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు నర్సింహారావు, కృష్ణారావు, లాల్‌బాబు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాపులో..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపులో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీఎం ఎం.శాలేంరాజు హాజరయ్యారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, వర్క్‌షాప్ యాక్టింగ్ హెచ్‌ఓడీ బి.శంకర్, ఐఈడీ యోహాన్, ఏజీఎం ఫైనాన్స్ సుమలత, వర్క్‌షాపు ఇంజనీరు అనిల్, కార్యదర్శులు ఎండీ సత్తార్‌పాషా, మధుకృష్ణ, విక్టర్ వందనం, సామ్యూల్ సుధాకర్, ఐమన్స్, సుందర్‌రాజు, కరుణాకర్, ప్రభాకర్, శివరాం పాల్గొన్నారు.

పాల్వంచ: యేసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం అని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక వెంకటేశ్వర హిల్స్ కాలనీలో షారోన్ బేతేలు ప్రేయర్ చర్చ్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. క్యాండిల్స్ వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీస్తు జననం సెట్టింగ్ భక్తులను ఆకట్టుకుంది. దైవ సేవకులు (రాజమండ్రి) మనోజ్ పాల్, పాస్టర్ వరహాల రాజు, యూసీఎఫ్ డైరెక్టర్ జాన్‌విల్సన్, సెక్రటరీ రవి, కాలనీ అధ్యక్షులు ఎం.డేవిడ్, సురేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు బుధవారం రాత్రి స్థానిక హైస్కూల్ ఎదురుగా ఘనంగా నిర్వహించారు.

మండలంలోని అన్ని పంచాయతీల నుంచి పాస్టర్లు, సిస్టర్లు, క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా రెవరెండ్ కె.విజయ్ కుమార్, రెవరెండ్ జన్ను ఇర్మియ హాజరయ్యారు. మాట్లాడుతూ.. సర్వ మానవాళి రక్షణ కొరకు ఏసుక్రీస్తు నరుడుగా ఈ భూమి మీదకు వచ్చినట్లు చెప్పారు. యేసును నమ్మితే సంతోషం, ప్రేమ కలిగి ఉంటారని తెలిపారు. ప్రపంచంలో ఎక్కువ మంది ప్రజలు జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. పరమత సహనం పాటించాలని, ప్రజలకు శాంతి సందేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం మండల ఫెలోషిప్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సిస్టర్లు, కార్యవర్గ సభ్యులు బి.జాన్ రాజ్, జి.రాజు రామ్ చందర్, టి.బోయాజ్, పి.అబ్రహం, హానోకు, బి.దేవరాజ్, సంధ్యారాణి, దావీదు, యోసేపు, పేతురు, మార్కు, యోహాను, సుమంత్, ఆంద్రయ, దేవదాస్, స్టీఫెన్, నరేష్, పౌలు, మోసే, దానియేలు, అబ్రహం, కమలాకర్, రాజ్ కుమార్, శ్యాంబాబు, తారాబాయి, ప్రేమరాజు, సీమోను, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ ఆజాద్‌నగర్‌లో రగులుతున్న అగ్ని మినిస్ట్రీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్లు డేవిడ్ పాల్‌రాజ్, మేరీ ప్రసన్న ఏసుక్రీస్తు సందేశాన్ని, బైబిల్‌లోని వాక్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం చిన్నారులు, యువత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పాల్వంచ: వేడుకలో పాల్గొన్న ప్రభాకర్‌రావు, మనోజ్‌పాల్



ఇల్లెందురూరల్: నృత్యం చేస్తున్న చిన్నారులు



సింగరేణి(కొత్తగూడెం): ఏరియా వర్క్‌షాపులో వేడుకలకు హాజరైన జీఎం శాలేంరాజు

22న జీపీ వర్కర్ల సమావేశం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఈనెల 22న టేకులపల్లిలో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మూడు బిచ్చు, ఈసం మహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తనప్పటికీ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం విస్మరించిందన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కార్మికవర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గం ఆందోళన బాట పట్టక ముందే సమస్యలను పరిష్కరించి చిత్తశుద్ధిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంపన్న, బాబు, లక్ష్మయ్య, ఎర్రయ్య, జనక ప్రసాద్, తరియా, మాడే వెంకటేశ్వర్లు, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించండి..

ఇల్లెందు: సింగరేణి బొగ్గు లారీల లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని టీయూసీఐ డిమాండ్ చేసింది. శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులకు న్యాయం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. మంగళవారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా ఓసీలు, సీహెచ్‌పీలు, వే బ్రిడ్జిల వద్ద లారీల లోడింగ్, అన్‌లోడింగ్‌లో 1,755 మంది కార్మికులు పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్మికులకు పీఎస్ రేటు ప్రకారం పారితోషికం చెల్లిస్తున్నారు. ఫలితంగా పూట గడటం కష్టంగా మారింది. పని ప్రదేశంలో కనీస వసతులు ఉండటం లేదు. చమ్మస్‌లు, పికాస్‌లు ఇవ్వటం లేదు. మంచినీటి సదుపాయం లేదు. డంప్‌యార్డుల్లో బొగ్గు పెల్లలు పడి తీవ్రంగా గాయపడిన కార్మికులు ఎంతో మంది ఉంటున్నారు. కోల్ డిస్పాచింగ్ విభాగంలో పని చేసే బొగ్గు లారీల లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులకు సొసైటీలు ఏర్పాటు చేయటమో లేదంటే నేరుగా సింగరేణి ద్వారా వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎండీ బలరాం ఈ విభాగం కార్మికుల పట్ల సానుభూతి చూపాలని విన్నవించారు.

సొంతింటి సాధనే లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల లక్ష్యసాధనే సీఐటీయూ లక్ష్యమని, సింగరేణి గుర్తింపు సంఘం కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే, ఎలాంటి పదవులు లేకున్నా నిత్యం కార్మికుల సమస్యల కోసం పోరాటాలు సాగించేది సీఐటీయూ మాత్రమేనని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అన్నారు.

బుధవారం ఏరియాలోని పీవీకే–5 షాఫ్ట్ వద్ద జరిగిన సొంతింటి పథకం కోసం కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల చిరకాల కోరిక నెరవేర్చాలని సొంతింటి పథకం సింగరేణిలో అమలు చేయాలని ఇందులో భాగంగా గనిమీద ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ పథకం అమలైతే సంస్థకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. గాజుల రాజారావు, వై.వెంకటేశ్వరరావు, భూక్యా రమేష్, కొత్తపల్లి రమేష్‌బాబు, గడల నర్సింహారావు, నాజర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రేషన్ కార్డులు ఇవ్వాలి

సుజాతనగర్: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెన్షన్లు, ధరణిలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలకు వితరణ

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనంతారం గ్రామానికి చెందిన కొర్రా రమేష్, కొత్తగూడెం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ మేడిచర్ల రవి బుధవారం స్టౌ, సిలిండర్‌ను వితరణ చేశారు. ఉపాధ్యాయుడు మిర్యాల రమేష్ సహకారంతో దాతలు.. 10వ తరగతి విద్యార్థులకు స్నాక్స్ తయారీ, నైట్ తరగతుల నిర్వాహణ కోసం వీటిని హెచ్‌ఎం పి.సంజీవరావుకు అందజేశారు.

రేపు దివ్యాంగులకు బస్ పాస్‌లు

పాల్వంచ: 20న పాల్వంచ బస్టాండ్‌లో దివ్యాంగులకు బస్ పాస్‌లు ఇవ్వడం జరగుతుందని కొత్తగూడెం డిపో మేనేజర్ మలగం దేవేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం ధృవీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, ఫొటో, ఆన్‌లైన్ చార్జ్ రూ.50 తెచ్చుకోవాలని, వివరాలకు 9959225959 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పదోన్నతులు కల్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో పనిచేసే ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని ఏరియా ఉపాధ్యక్షుడు ఆర్‌సీహెచ్‌పీ ఎస్ఈ కరీముల్లాను కోరారు. బుధవారం కార్మికుల సమస్యలపై చర్చించారు. రజాక్ మాట్లాడుతూ.. సీహెచ్‌పీలో సరిపడ సిబ్బంది లేక ఉన్నవారిపై పనిభారం పడుతోందని వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. స్పందించిన ఎస్ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే గౌస్, శంకర్ బాబు, కృష్ణ మోహన్, సాంబశివరావు, ఎండీ జానీ, డి.శ్రీనివాస్, క్రాంతి కుమార్, రాధాకృష్ణ తదితరు లు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు కృషి



వినోభానగర్ అటవీ నర్సరీని పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

జూలూరుపాడు: అడవుల పరిరక్షణ, అభివృద్ధితోపాటు, వన్యప్రాణుల సంరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం ఎఫ్‌డీఓ యు.కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో ఎఫ్‌డీఓ పర్యటించారు. వినోభానగర్, జూలూరుపాడు నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక ఎఫ్ఆర్‌ఓ కార్యాలయంలో అటవీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా అటవీ విస్తీర్ణం ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని అటవీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్‌ఓ నసూర్‌బీ, ఎఫ్ఎస్‌ఓలు హనుమంతు, సలీం, వి.మల్లయ్య, బీట్ ఆఫీసర్లు రేఖ, శ్రీలత, విజయలక్ష్మి, అనిత, డి.రవి, వెంకటేశ్వర్లు, రహీం, శ్రావణ్, శరణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏఐకేఎంఎస్ శిక్షణ తరగతులు

టేకులపల్లి: ఈనెల 20, 21 తేదీలలో గార్లలో జరగనున్న అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా హర్షన్యనాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రూ.రెండు లక్షల రుణమాఫీ, రైతు సమస్యలను పరిష్కరిస్తామని అనేక హామీలు ఇచ్చి సంవత్సరం అయిందని అయినా పరిష్కరించలేదని విమర్శించారు. ప్రభుత్వం రైతుల సమస్యలేవీ పరిష్కరించకపోగా గత కేసీఆర్ ప్రభుత్వం బాటలోనే రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రూ.కోట్ల రుణాలను మాఫీ చేస్తోందని, గిట్టుబాటు ధరలు కల్పించమని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలని రైతు వ్యతిరేక మూడు చట్టాలను విరమించుకోవాలని, 2021లో చేసిన ఉద్యమ సందర్భంలో హామీ ఇచ్చి నేడు దానిని విస్మరించిందన్నారు. గత హామీల అమలు కోసం రైతాంగం చలో ఢిల్లీ బాట పట్టిందని రైతాంగ ఉద్యమంపై మోదీ కార్పొరేట్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోందని వాపోయారు. భూక్యా నర్సింగ్, కీర్యా, బిక్యా, లచ్చు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు అవకాశం కల్పించండి..

కొత్తగూడెంఅర్బన్: అంతర్జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం అహలే సున్నత్వల్ జామాత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కూలీలైన్‌లోని జిల్లా కార్యాలయంలో ఏఎస్‌జే జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ కరీం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఎస్‌జే చైర్మన్ ఎంఏ రజాక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. దేశంలో మైనారిటీ హక్కులకు భంగం కలగకుండా చూసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదుల, అదనపు ప్రభుత్వ న్యాయవాదుల నియామకాల్లో ముస్లిం మైనారిటీ న్యాయవాదులకు సముచితం స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహమ్మద్ గౌస్ మోహినుద్దీన్, షేక్ యాకుబ్ ఖాద్రి, షేక్ శామీయుద్దీన్, హుస్సేన్ ఖాన్, మహమ్మద్ షఫీ ఖాద్రి, మహమ్మద్ అక్తర్ పాషా, షేక్ నయీమ్, మహమ్మద్ యాకుబ్ మహ్మద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పాల్వంచ: భార్యను అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్త, అతని అక్క, బావ, అన్నయ్యపై కేసు నమోదు అయింది.

పోలీసుల తెలిపిన వివరాలు... పట్టణంలోని పాత పాల్వంచకు చెందిన ఎస్‌కె.షమాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం, పెనుగోలుకు చెందిన ఎస్‌కె.సలీమ్‌తో 2023లో వివాహం జరిగింది. ఏడు నెలల తరువాత అదనపు కట్నం తేవాలని, లేదంటే విడాకులు ఇవ్వాలని మానసికంగా వేధిస్తున్నారు. ఈ క్రమంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

బెదిరింపులకు దిగుతున్న వ్యక్తిపై..

వాల్ రైటింగ్‌లను చెరిపివేస్తున్న వ్యక్తిని ఇందేంటని అడిగనందుకు బెదిరింపులకు దిగిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. వివరాలు.. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన కొంగల సతీష్ అనే సెప్టిక్ ట్యాంక్ ఓనర్ తన పబ్లిసిటీ కోసం పట్టణంలో పలుచోట్ల రాసుకున్న ఫోన్ నంబర్లను లక్ష్మీదేవిపల్లి పంచాయతీకి చెందిన జగన్నాథం రాంబాబు చెడిపివేసి తన అతని నంబర్లను రాస్తున్నాడు. ఇదేమిటని అడిగినందుకు ఎస్సీ యాక్ట్ కేసు పెడతానని బెదిరింపులకు దిగాడు. దీంతో బుధవారం సతీష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైపవర్ వేతనాలు ఇవ్వండి..



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల బోనస్ చెల్లించాలని, జేబీసీసీఐ నిర్ణయించిన హైపర్ వేతనాలు అమలు చేయాలని, అన్ని విభాగాల్లో 8 గంటల పని, సీఎంపీఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ మాట్లాడుతూ.. 2013 నుంచి కోల్ ఇండియాలో అమలు జరుగుతున్న హైపవర్ వేతనాలు అమలు చేయకుండా సింగరేణి మొండికేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పును కూడా అమలు చేయటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, మహేందర్, సాయి, శ్రీనివాస్, ఎస్ శ్రీనివాస్, గణేష్, లక్ష్మణ్,రఘు, రాంబాబు తదితరులు ఉన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో 33వ బ్యాచ్ సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్‌పై బుధవారం శిక్షణ తరగతులను జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎవరైన ప్రమాదానికి గురైన సమయంలో ఆస్పత్రికి తరలించేలోపు ఫస్ట్ చేయటం వాలన ప్రమాదం నుంచి బయటపడతారని చెప్పారు. అదే విధంగా అగ్నిప్రమాదం జరిగినప్పుడు విలువైన వస్తువులు, మనుషులు చిక్కిన సమయంలో శిక్షణలో నేర్చుకున్న వాటిని ఉపయోగించి ప్రమాదాల నుంచి కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, డి.నారాయణరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ జి.భాస్కర్‌రెడ్డి, జమేదార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ